క్లుప్తంగా

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



గనికపూడి (ప్రత్తిపాడు): మండల పరిధిలోని గనికపూడిలో బుధవారం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ఎస్‌కే మహమ్మద్, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్‌లు హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ యునిస్ మాట్లాడుతూ ఇక నుంచి హెల్త్ క్లినిక్ వేదికగానే వ్యాక్సినేషన్, ఫ్యామిలీ ఫిజిషియన్ సర్వీసులు, గర్భవతులకు అందించే అన్ని రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫాతిమా, ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్‌ఎన్ నిర్మల, హెచ్‌వీ విజయకుమారి, ఏఎన్‌ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల విద్యా బోధన చేస్తుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో హెటిరో ఫార్మా సంస్థ సిబ్బంది ప్రాంగణ ఎంపికలను నిర్వహించారన్నారు. ఈ ఎంపికల్లో తమ కళాశాల నుంచి 14 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. సంస్థ రూ.3 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైన విద్యార్థులతో ఒప్పందం చేసుకుందన్నారు. చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, హెటిరో సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ నవీన్, హెచ్‌ఆర్ శ్రీకాంత్, రాజేష్ తదితరులు ఉద్యోగాలను పొందిన విద్యార్థులను అభినందించారు.

ఇళ్లస్థలం పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత



తెలగాయపాలెం(కాకుమాను): నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి అన్ని విధాలుగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామ సర్పంచ్ చింతల రాహేలమ్మ అన్నారు. మండలంలోని తెలగాయపాలెం గ్రామంలో బుధవారం పలు కుటుంబాలకు ఇళ్ల స్థలం పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 66 కుటుంబాలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ ముప్పా శివయ్య, నాయకులు గొరిజవోలు రంగారావు, కొండపాటూరి సుబ్బారావు, ముప్పా చిన్న, పెద్ది మురళి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి రోజూ మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్



గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో ప్రతి రోజూ మహిళా ఉద్యోగులతో పాటు సాధారణ మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి, వైద్యం అందించిన క్యాన్సర్ విభాగం వైద్యులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు సుమారు 300 మంది మహిళా ఉద్యోగులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షల్లో అనుమానం ఉన్న ఉద్యోగులకు కూడా నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని దత్తత తీసుకున్న మండలాల్లో ప్రతి నెల క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గ ప్రసాద్, డాక్టర్ పి.వి.శివరామకృష్ణ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ అరుణ, డాక్టర్ ఉమా, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార వాహనాలు సిద్ధం

స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: 57 నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించిన పిదపే ఓట్లు అడుగుతామని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి ఏర్పాటు చేసిన వాహనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పొన్నూరులో రూ.1,650 కోట్లు సంక్షేమ పథకాలద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. వందల కోట్లతో గ్రామాల అభివృద్ధి జరిగిందని వెల్లడించారు. చేసిన అభివృద్ధిని వివరించేందుకే వాహనాలతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, గ్రామ సచివాలయం నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల ఇంటి వద్దకే పాలనను తీసుకువచ్చిన ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలలో ప్రజలు ఆశీర్వదించి మళ్లీ జగనన్నను సీఎంగా చేయాలని కోరారు. అనంతరం మురళీకృష్ణను స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, సర్పంచ్ భవనం వంశీ రెడ్డి, నాయకులు షేక్ నాజర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న సంకల్పం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా
- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌తో కలిసి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



మైక్రోవాటర్ ఫిల్టర్ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న హెనీక్రిస్టీనా, బలసాని, లాలుపురం రాము

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా అన్నారు. బుధవారం లాలుపురం గ్రామంలో రూ.కోటి తో నూతనంగా నిర్మించనున్న మైక్రోవాటర్ ఫిల్టర్ అభివృద్ధి పనులను ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము)లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రూ.29 లక్షలతో నూతనంగా నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. లింగాయపాలెం గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లాలుపూరం, లింగాయపాలెం గ్రామాల్లో పర్యటించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతమయ్యిందన్నారు. పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి పేద కుటుంబం అభివృద్ధి చెందిందన్నారు. విపత్కర కరోనా సమయంలో సైతం ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అని కొనియాడారు.జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాము మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు, మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్ర, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కాకుమాను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టవలసిన పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు.

పెదకాకానిలో నేడు చేయూత చెక్కులు పంపిణీ

పెదకాకాని: పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చేయూత చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ మల్లేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మండల పరిధిలోని ఆయా గ్రామాలలో 45 నుంచి 60 ఏళ్ల మధ్యలో గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన మహిళలకు ఇప్పటికే నాలుగు సార్లు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. చివరి విడతగా గురువారం ఉదయం 11 గంటలకు చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యాన్ని అందించి ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి అన్నారు. బుధవారం డివిజన్‌లోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కృష్ణప్రభ, డాక్టర్ ప్రేమ్‌సామ్యూల్, షేక్ షాహినూర్, ఏఎన్ఎమ్ కృష్ణవేణిలు స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐసీయూలో అన్నిరకాల వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నూతనంగా నిర్మించిన ఐసీయూలో రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచుతామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఐసీయూ విభాగాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రోగులను వారి సహాయకులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉండే గదుల వద్దకు తీసుకెళ్లడం గమనించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ.. వైద్య పరీక్షలన్నీ ఐసీయూలోనే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈసీజీ వైద్య పరికరం ప్రత్యేకంగా ఐసీయూలో ఏర్పాటు చేస్తున్నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నకిలీ ఆధార్‌తో అక్రమ రిజిస్ట్రేషన్

- రూ.10 లక్షల భూమి యజమానికి తెలియకుండానే అమ్మకం
- అడ్వాన్స్ ఇచ్చిన వ్యక్తి ఈసీలను తీసుకోవడంతో వెలుగులోకి వచ్చిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు
- న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న బాధితుడు



అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన నివేశనస్థలం

పెదకాకాని: నకిలీ ఆధార్ కార్డుతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా మారింది. కార్యాలయంలో కొందరు సిబ్బందికి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేయించే వారితో సంబంధాలు ఉండటంతో బీ ఫారాలు, గ్రామ కంఠంలో ఉన్న భూములకు సైతం యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన సజ్జా సాంబశివరావు 1984లో పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామ పరిధిలోని సర్వే నంబరు 116ఏ లో ఉన్న 149 చదరపు గజాల స్థలం కొనుగోలు చేశాడు. ఈ స్థలానికి సంబంధించి కొందరు ఈసీకి దరఖాస్తు చేశారు. దాని ఆధారంగా నకళ్లకు దరఖాస్తు చేశారు. ఆ నకళ్లు చూపించి స్థల యజమాని అమ్మినట్లు గుంటూరుకు చెందిన జొన్నలగడ్డ మరియమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. వాస్తవానికి రిజిస్ట్రార్ నకళ్లపై రిజిస్ట్రేషన్ జరగాలంటే అధిక సర్క్యులేషన్ ఉన్న దిన పత్రికలో ప్రకటన ఇవ్వడం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎన్‌ఓసీ తీసుకోవడం తప్పనిసరి. అలాంటివి ఏమీ లేకుండానే ఒక చిన్న పత్రికలో ప్రకటన ఇచ్చి, నకిలీ ఆధార్ కార్డుతో సజ్జా సాంబశివరావు అమ్మినట్లు ఫిబ్రవరి 2న రిజిస్ట్రేషన్ చేశారు. సరిగ్గా 25 రోజులకే స్థలం హద్దులు తప్పులు పడ్డాయని, ఫిబ్రవరి 27న సరవణ చేయించారు. అదే రోజు గుంటూరుకు చెందిన ఏరువ జయప్రకాష్‌రెడ్డికి జొన్నలగడ్డ మరియమ్మ చేత 3 గంటల వ్యవధిలోనే అదే పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్ వెలుగులోకి వచ్చిందిలా..

ఇటీవల ఆ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఒప్పందం కుదుర్చుకున్న ధరలో 4వ వంతు నగదు చెల్లించి ఈసీకి దరఖాస్తు చేసుకున్నాడు. ఈసీల్లో జొన్నలగడ్డ మరియమ్మ, ఏరువ జయప్రకాష్ రెడ్డి పేర్లు ఉండటంతో ఆందోళన చెంది స్థలం కొనుగోలుకు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి తీసుకోవడంతో నకిలీ ఆధార్, నకళ్లపై డాక్యుమెంట్ సృష్టించి అమ్మకాలు చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా గత కొంతకాలంగా పలు అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. అసైన్డ్ భూములకు, ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన బీఫారాలకు, గ్రామ కంఠాలకు ప్రక్కన ఉన్న సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయడం సర్వసాధారంగా మారింది. వివాదాస్పదంగా మారిన వెంచర్లలో ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి విచారించి చర్యలు తీసుకోవాలని భూముల యజమానులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై రిజిస్ట్రార్ జాన్‌మోహన్‌రావును వివరణ కోరగా 1984 లో స్టాంపులపై భూమి యజమాని ఫోటో లేకపోవడంతో నకిలీ ఆధార్ సృష్టించి, అసలు యజమానిగా నమ్మించి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అసలు యజమానులతో మాట్లాడటం జరిగిందని అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుకు చర్యలు తీసుకుంటామన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వెంకాయమ్మ



వంగిపురంలో అవగాహన కల్పిస్తున్న అరుణ

చినలింగాయపాలెం(కాకుమాను): చిన్నారులకు చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని ఇవ్వడం ద్వారా వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పాండ్రపాడు సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ అన్నారు. అంతర్జాతీయ పోషకాహార పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని చినలింగాయపాలెం బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారుల తల్లి దండ్రులకు చిరు ధాన్యాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ చిన్నారులకు బాల్యం నుంచే చిరు ధాన్యాలను అలవాటు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు యుక్త వయసులో ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో తమ చిన్నారులకు ప్రతి రోజు చిరు ధాన్యాలు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య జీవనం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ వెంగళాయపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ మెహరున్నీసా సూచించారు. బుధవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై సుష్మ, రేఖ, అనిల్ కుమారి, వై భాగ్యలత, అంకమ్మ పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు

వంగిపురం (ప్రత్తిపాడు): చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రత్తిపాడు సెక్టారు పరిధిలోని వంగిపురం, ప్రత్తిపాడు ఉప్పరపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరు ధాన్యాల ఆవశ్యకతపై తల్లులు, గర్భవతులు, మహిళలకు సూపర్‌వైజర్లు అరుణ, ఎంపీ రత్నంలు అవగాహన కలిగించారు. రాగిజావ ఎంతో బలవర్ధక ఆహారమని తల్లులు రాగి జావను తాగడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్‌ఎం శౌరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గీతాంజలి మృతి కారకులను కఠినంగా శిక్షించాలి



పాత మద్రాసు రోడ్డులో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మహిళలు, నాయకులు

ప్రత్తిపాడు: తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా సైకోలు చేసిన అసభ్య ట్రోలింగ్‌ను తట్టుకోలేక తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని, మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పాతమల్లాయపాలెం కూడలిలోని వైఎస్సార్ కాంస్య విగ్రహం నుంచి బస్టాండు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులను ఉంచి గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి మాట్లాడుతూ గీతాంజలి మృతికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా క్రియాశీలక వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెది ఆత్మహత్య కాదని టీడీపీ, జనసేనలు చేసిన హత్య అని మండిపడ్డారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందానని చెప్పడమే ఆ అమాయకురాలు చేసిన నేరమయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వట్టిచెరుకూరు జెడ్పీటీసీ సభ్యురాలు బీమినేని వెంకటలక్ష్మి, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ బాపతు వెంకటరమణ, మహిళా నాయకురాలు కవిత, పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, జిల్లా కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరులో నిరసన ర్యాలీ

పొన్నూరు: రాష్ట్రంలో మహిళలు తలదించుకునే విధంగా టీడీపీ, జనసేన పార్టీలు వ్యవహరిస్తున్నాయని పొన్నూరు వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పార్టీ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ పేదింటి మహిళపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలతో వేధించి ఆమె ఆత్మహత్యకు పాల్పడేవిధంగా చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. మహిళల పట్ల టీడీపీ, జనసేన పార్టీలకు ఏమాత్రం గౌరవం లేదని అన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేనలకు మహిళలు గట్టి బుద్ధి చెపుతారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు షేక్ షర్మిల, గేరా కుమారి, అనిలా కుమారి, నాయకులు షేక్ నాజర్ తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'కు ఉజ్వల భవిష్యత్తు

అరిజోనా స్టేట్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ పాట్రిక్ ఫెలాన్



విజ్ఞాన్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ పాట్రిక్ ఫెలాన్‌తో వీసీ నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: భవిష్యత్‌లో ప్రపంచమంతా ఆర్టిఫీషి యల్ ఇంటెలిజెన్స్ మయం కానుందని యూఎస్ఏలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ డీన్ ప్రొఫెసర్ పాట్రిక్ ఫెలాన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ది ఫ్యూచర్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇంజినీరింగ్ ఎట్ అరిజోనా స్టేట్ యూనివర్సిటీ' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం బుధవారం జరిగింది. డీన్ ప్రొఫెసర్ పాట్రిక్ ఫెలాన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ స్కిల్స్ ఉంటేనే సంస్థలు అభ్యర్థుల వైపు చూసే పరిస్థితి ఉందన్నారు. సమీప భవిష్యత్‌లో ప్రపంచమంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చుట్టూ తిరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ మార్కెటింగ్ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు వినియోగదారుల మనోభావాలను, వారి కొనుగోలు అలవాట్లను ముందే ట్రాక్ చేసి సంస్థలకు అందజేస్తుందన్నారు. ట్రాన్స్‌ఫర్ రిక్రూట్‌మెంట్ అసోసియేట్ డైరెక్టర్ చెస్టర్ హెండర్సన్, రోషన్ లాలన్, వీసీ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర వెలకట్టలేనిది

గుంటూరు మెడికల్: వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్లు కీలక పాత్ర వహించి, వైద్యం సక్రమంగా అందేలా వారికి నివేదికల ద్వారా తోడ్పాటు అందిస్తున్నారని గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే ను పురస్కరించుకొని స్థానిక లక్ష్మీపురంలోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఆదర్శ ల్యాబ్ టెక్నీషియన్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆనం సంజీవరెడ్డి మాట్లాడుతూ నగరంలో 50 ఏళ్లుగా ఈ రంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వైద్య వృత్తిలో చాలామంది టెక్నీషియన్‌లకు శిక్షణ ఇచ్చారన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

గుంటూరు–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చల్లా రమేష్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని గుంటూరు–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చల్లా రమేష్ హెచ్చరించారు. వట్టిచెరుకూరు మండలంలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు స్థానిక సిబ్బందితో కలిసి ఆకస్మికంగా విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక సబ్‌స్టేషనులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఈ వివరించారు. 49 సర్వీసులకు అదనపు లోడ్ కింద రూ.2.70 లక్షలు అపరాధ రుసుములుగా విధించినట్లు తెలిపారు. 60 మంది సిబ్బంది 31 బృందాలుగా ఏర్పడి 2,046 సర్వీసులు తనిఖీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీరు పి. విజయ్‌కుమార్, డీఈఈలు మల్లికార్జునరావు, గురునాథరావు, అశోక్, టూటౌన్ ఏఈలు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుద్ధ్యం

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్–1 విభాగ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. బుధవారం స్థానిక కేఎస్సార్పీ నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారిణి ఎం. సంతోష్‌కుమారి మాట్లాడారు. మొక్కల సంరక్షణతో కాలుష్య నివారణకు తమవంతు పాత్ర పోషించాలన్నారు.